సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 25 । జూలై । 2024



సోమశిలలో 9.670 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 9.670 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,300
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,438
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,631
సవర (8 గ్రాములు)	రూ.53,048

గరిష్టం/కనిష్టం
35.1 /28.9

వాతావరణం

గాలిలో తేమ 55 శాతంగా బుధవారం నమోదైంది. గురువారం జిల్లాలో పొడి వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 25 కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు పంపిణీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ధరలను అదుపులో ఉంచేందుకు 25 విక్రయ కేంద్రాల ద్వారా బియ్యం, కందిపప్పు అందజేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కందిపప్పు కిలో రూ.160, పచ్చిబియ్యం కిలో రూ.48లు, ఆవిరి బియ్యం రూ.49లకు విక్రయించేలా వ్యాపారస్తులతో మాట్లాడి ధరలు నిర్ణయించామని అన్నారు. జిల్లాలో 438 రేషన్ వాహనాల ద్వారా పంపిణీ చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో 31 వాహనాల ద్వారా సరఫరా జరగడం లేదన్నారు. పౌరసరఫరాల ద్వారా జరుగుతున్న పంపిణీ కార్యక్రమం సజావుగా సాగేలా పటిష్ట చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• నూతన కమిషనర్ సూర్యతేజ



బాధ్యతలు స్వీకరించిన సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన కమిషనర్ మల్లవరపు సూర్యతేజ తెలియజేశారు. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బుధవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. పారదర్శకంగా పాలన అందించేందుకు కృషి చేస్తానని, ప్రజల నుంచి ప్రతిరోజూ అర్జీలు స్వీకరిస్తానని తెలిపారు. కార్యాలయంలోని అన్ని విభాగాలతో సమీక్షలు నిర్వహించి నగరాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యం రూ.1,990 కోట్లు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పొదుపు సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,990 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సంలో జిల్లాలో పొదుపు సంఘాలకు రూ.1600 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు అందజేశామన్నారు. జూలై నెలాఖరు కల్లా రూ.700 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు చేయాలన్నది లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 39,935 పొదుపు సంఘాల్లో 26,012 సంఘాలు చలామణిలో ఉన్నాయన్నారు.

ఫోర్జరీ కేసు.. పరారీలోనే నిందితులు

• అమరావతిలో మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి మార్ట్‌గేజ్ ఫైల్స్‌పై కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన వ్యవహారంలో నగర మేయర్ భర్త జయవర్ధన్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఆయనతో పాటు ప్రైవేట్ ఇంజనీర్ దిలీప్‌కుమార్, శివరామకృష్ణలకు సంబంధం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. నగర పాలక సంస్థ గత కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకాన్నే కాకుండా అంతకు ముందున్న కమిషనర్ హరిత సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఫోర్జరీ వ్యవహారంపై ఇప్పటికే ఏడుమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరందరిని అదుపులోకి తీసుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నారు. ఇది ఇలా ఉండగా మేయర్ స్రవంతి తన భర్తను ఫోర్జరీ వ్యవహారంలో నుంచి బయటకు తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఆమె రాజధాని అమరావతికి వెళ్లి అక్కడ జిల్లాకు చెందిన మంత్రులతో పాటు పార్టీకి చెందిన ఇతర కీలక నేతలను కలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయంలో ఆమె ఎంతవరకు సఫలీకృతురాలు అవుతారో వేచి చూడాల్సిందే.

మనుబోలు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మనుబోలు: మనుబోలు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను ప్రభుత్వ సస్పెండ్ చేసింది. ఈ మేరకు బుధవారం మనుబోలు ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. వెంకటరమణ గతంలో మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండగా ఎస్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు తప్పుడు రసీదులు ఇచ్చాడని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టగా అది వాస్తవమని తేలడంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

దేవుళ్లకే పంగనామాలు



• చారిత్రక నేపథ్య ప్రధాన ఆలయాల్లో కుంభకోణాలు
• రంగనాథునికి రూ.7 కోట్లకు శఠగోపం
• కామాక్షితాయికి రూ.8 కోట్లు టోకరా
• అవినీతికి పాల్పడిన ఈఓలు, మాజీ ఆలయ పాలకవర్గాలు
• విజిలెన్స్, శాఖాపరమైన విచారణలు జరిపినా చర్యలు శూన్యం

ధూప, దీప, నైవేద్యాలకు కావలసిన వాటిలో పాలు ఒకటి. పాల కోసం నెల్లూరు రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేకంగా గోవులను పోషిస్తున్నారు. గోవులకు వాటికి పుట్టిన దూడల పోషణ కోసం నెలవారీ రూ.1.5 లక్షలు మేత కోసం ఆలయ ఈఓ ఖర్చు చేశారు. ఇంత ఖరీదైన మేత ఏమిటని ఆరా తీస్తే కేవలం గడ్డి కోసమే రూ.లక్షన్నర ఖర్చు చేశారంట. ఇదీ రంగనాయక స్వామి ఆలయంలో అధికారులు రాసుకునే ఖర్చుల జాబితా. గతంలో ఆలయంలో జరిగిన విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన సంఘటన ఇది.





సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో చారిత్రక నేపథ్యం ఉన్న ప్రధాన ఆలయాల్లో అక్రమార్కులు తిష్టవేసి దేవుళ్లకే శఠగోపం పెడుతున్నారు. భక్తులు భక్తితో సమర్పించుకునే కానుకల నుంచి, దేవదేవేరుల నిత్య కైంకర్యాలు, సేవలు, ఆలయ అభివృద్ధి, అన్నదానం తదితర అవసరాల కోసం దాతలు ఇచ్చే విరాళాల నుంచి ప్రభుత్వం కేటాయించే నిధులు వరకు భోంచేస్తున్నారు. బ్యాంకు బ్యాలెన్స్‌లకు వచ్చే వడ్డీలను సైతం వదలకుండా జేబుల్లో నింపుకుంటున్నారు. నిత్యం వీఐపీ సేవల్లో పరితపించే ఆలయ అధికారులు తామెన్ని తప్పులు చేసినా పట్టించుకోరు అన్న ధీమాతో బరితెగించి అవినీతికి పాల్పడుతున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సైతం ఆలయ అధికారులు ఇచ్చే మామూళ్లతో అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోగా అందలం ఎక్కిస్తున్నారు.

జొన్నవాడ ఆలయంలో రూ.8 కోట్లు స్వాహా

ఆదిపరాశక్తిగా పేరున్న జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో అక్రమార్కులు బరితెగించారు. ఆలయంలో కోటి కుంకుమార్చన, మహా కుంభాభిషేకం, బ్రహ్మోత్సవాలు, అన్నదాన నిర్వహణ, ప్రసాదాల తయారీ, ఫలసరుకుల కొనుగోలులో అక్రమాలకు పాల్పడి అమ్మవారి సొమ్ము బొక్కేశారు. గత ఆలయ పాలకవర్గంలో కీలక నేత నుంచి గతంలో పనిచేసిన ఆలయ ఈఓలు కూడా ఇందులో ప్రధాన భాగస్వామ్యం అయ్యారు. దాదాపు 8 ఏళ్ల పాటు రూ.8 కోట్ల నిధులు స్వాహా చేశారు. ఇంతే కాదు ఆలయ అభివృద్ధి నిధులు బ్యాంకుల్లో జమచేస్తే వచ్చే వడ్డీలను కూడా సొంత ఖాతాలకు మళ్లించుకుని ప్రసాదాల్లా ఆరగించిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల జొన్నవాడ ఆలయంలో జరిగిన అక్రమాలపై శాఖాపరమైన విచారణ జరిపిస్తే నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఎనిమిదేళ్ల పాటు నిరాటంకంగా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఆలయ నిధులు రూ.66 లక్షలు సొమ్ము బ్యాంకులో జమచేస్తే.. రెండేళ్ల గడిచే లోపు రూ.44 లక్షల వరకు అప్పు తేల్చారంటే అవినీతి ఏ స్థాయికి చేరిందో ఇట్టే తెలిసిపోతుంది. నకిలీ బిల్లులు, హారతి పళ్లెంలో వేసే కానుకుల నుంచి ప్రతి ఏటా కండువాల కొనుగోళ్ల వరకు అన్నీ అక్రమాలే జరిగాయి. తమ అక్రమ సంపాదన కోసం అవుట్ సోర్సింగ్ విధానంలో ఓ ప్రైవేటు సైన్యాన్ని తయారు చేసుకునే స్థాయి కెళ్లారు. జొన్నవాడ ఆలయ అవినీతి చూస్తే కళ్లు బైర్లు కమ్మే రీతిలో సాగింది.

విచారణ నివేదిక అందింది

జొన్నవాడ ఆలయంలో అక్రమాలపై అంతర్గత విచారణ నివేదిక అందింది. ఆలయంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. పై అధికారుల నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటాం.

–జె శ్రీనివాసరావు, ఏసీ, దేవాదాయశాఖ, నెల్లూరు

రంగనాథుడికే శఠగోపం

నగరంలో పెన్నమ్మ ఒడ్డున ఉన్న చారిత్రక శ్రీ రంగనాథుని స్వామి ఆలయంలో కూడా రూ.7 కోట్ల సొమ్ము స్వాహా జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేటతెల్లమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆలయంలో అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించారు. ఇందులో ఎన్నో అక్రమాలు వెలుగు చూశాయి. ఆవు, దూడకు మేత కోసం నెలవారీగా రూ.1.5 లక్షల వరకు ఖర్చు చూపారంటే అధికారుల అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. అంతేకాదు దేవుడి సహస్ర నామ పూజ కోసం ఉపయోగించే కండువాల కొనుగోళ్ల కోసం నెలవారీగా రూ.50 వేలు ఖర్చు చూపినట్లు వెలుగులోకి వచ్చింది. ఆలయ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా జరిగాయి. అధికారుల కనుసన్నల్లో భూముల ఆక్రమణలు జరిగాయి. ఆలయ అభివృద్ధి నిధులు ఆరగించిన సంఘటనలున్నాయి. విజిలెన్స్ నివేదికను దేవదాయశాఖ కమిషనర్‌కు పంపి మళ్లీ శాఖాపరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో విచారణ ప్రక్రియ నిలిచిపోయింది. ఇలాంటి అవినీతి కథలు జొన్నవాడ, శ్రీతల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలోనే కాదు నగరంలో ఉన్న రాజరాజేశ్వరమ్మ ఆలయంలో కూడా జరిగినట్లు గతంలో వెలుగులోకి వచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఆలయ అధికారులు తమ రాజకీయ పరపతి ఉపయోగించుకుని విచారణ జరిపించకుండా చేసుకున్నారు. ప్రతి ఏటా ఆశాఖ అంతర్గత ఆడిటింగ్‌లో కూడా అక్రమాలు వెలుగులోకి రానివ్వకుండా మామూళ్ల సమర్పించుకుంటూ దేవుళ్లకే శఠగోపం పెడుతున్నారు.

కంప్యూటరీకరణ వేగవంతం చేయండి



జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

• సహకార అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సహకార అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం జరిగింది. పీఏసీఎస్‌ల సామర్థ్యం, పారదర్శకత పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 78 పీఏసీఎస్‌లను నాబార్డు జాతీయ సాఫ్ట్‌వేర్ నెట్‌వర్కుకు అనుసంధానం చేసిందని, అందువల్ల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని సూచించారు. సహకార రంగంలో వికేంద్రీకృత ధాన్యం నిల్వ కేంద్రాల నిర్మాణానికి జిల్లాలో కోవూరు మండలం పడుగుపాడు పీఏసీఎస్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కోసం సొసైటీ కమిటీ రిజల్యూషన్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. దీనిలో వ్యవసాయ మౌలిక సదుపాయాలైన గోడౌన్లు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, చౌకధర దుకాణాలు, కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద ఒక చోట ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జేసీ సేదు మాధవన్, డీసీఓ గుర్రప్ప, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశు సంవర్ధకశాఖ జేడీ కోటేశ్వరరావు, డీపీఓ సుస్మిత, నాబార్డు సహకార బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు



కావలి: ఏపీలో దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఢిల్లీలో జంతర్ మంతర్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు.

సంగం ఇసుక రీచ్‌ను పరిశీలించిన అధికారులు



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సంగం: సంగంలో ఉన్న ఇసుక రీచ్‌ను మైనింగ్ అధికారులు బుధవారం సందర్శించారు. ప్రభుత్వం నూతన ఇసుక విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో రీచ్ వద్ద వసతులు పరిశీలించారు. డీ సిల్టింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వర్షాకాలంలో సైతం ఇసుక కొరత తలెత్తకుండా డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో నెల్లూరు, సూరాయపాళెం, సంగం రీచ్‌లలో ఇసుక డీ సిల్టింగ్ చేసేందుకు గుర్తించామని పేర్కొన్నారు. వారంలో అన్నీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నాగరాజు, డీఈ భాస్కర్‌రెడ్డి, ఏఈ కృష్ణ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏఈపై చర్యలు సరే... మరి డీఈఈ?



సిమెంటు, స్టీల్ మాయంపై విచారణ చేస్తున్న అధికారులు (ఫైల్)

• సిమెంటు కుంభకోణంలో ఏఈ సస్పెన్షన్
• గోడౌన్ తాళాలు ఉన్న డీఈఈని మాత్రం వదిలేశారు
• చక్రం తిప్పిన టీడీపీ నేతలు



సంగంలో గృహ నిర్మాణశాఖ సిమెంట్ గోడౌన్

సంగం: ఇద్దరు దొంగలు పేదల సిమెంట్‌ను అప్పనంగా అమ్ముకుంటే వారిలో ఒక్కరినే సస్పెండ్ చేసి మరో దొంగ చేతికి తాళాలిచ్చినట్లుగా ఉంది ఈ సంఘటన. సంగం మండలంలోని హౌసింగ్ శాఖలో సిమెంటు, స్టీలు కుంభకోణంలో అధికార పార్టీ చిత్ర విచిత్రాలకు తెరలేపింది. కుంభకోణం జరిగిన సమయంలో సంగం సిమెంట్, స్టీల్ నిల్వ ఉంచే గోడౌన్ల తాళాలు డీఈఈ చేతుల్లో ఉంటే ఆయనకు సహకరించిన ఏఈని సస్పెండ్ చేసి ప్రధాన దొంగ అయిన డీఈఈ చేతులకే తాళాలు ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సంగం మండలంలో పేదవారి ఇంటి కల నిజం చేయాలని గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 1072 ఇళ్లను మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణంలో 2024 జనవరిలో అధికారులు తమ స్వార్థానికి తెరలేపారు. హౌసింగ్ ఏఈ కరీముల్లా, డీఈఈ ముక్తాహార్‌లు సిమెంటు స్టీల్‌లో చేతివాటం ప్రదర్శించారు. దీంతో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ హరినారాయణన్ విచారణకు ఆదేశించారు. విచారణ జరుగుతున్నప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో చర్యలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఈ సిమెంటు, స్టీల్ అక్రమాలపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1,829 బస్తాలు సిమెంటు, 17,495.40 కిలోలు స్టీలు గల్లంతయినట్లు గుర్తించి ఏఈ కరీముల్లాను బుధవారం సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. ఈ గోడౌన్ తాళాలు తన దగ్గరే ఉంచుకుని కుంభకోణంలో ప్రధాన పాత్ర వహించిన డీఈఈ ముక్తాహార్‌ను మాత్రం జిల్లా తెలుగుదేశం పార్టీ మైనారిటీ నేత ఒత్తిడితో చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఆయనకే సంగం మండల హౌసింగ్ బాధ్యతలు ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొంగ చేతికి తాళాలు ఇస్తే తమ ఇళ్ల పరిస్థితి ఏంటని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

హౌసింగ్ ఏఈ కరీముల్లా సస్పెన్షన్

• గృహ నిర్మాణాల్లో అక్రమాల ఫలితం

నెల్లూరు(అర్బన్): హౌసింగ్ కార్పొరేషన్ సంగం మండల అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కరీముల్లాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కా ఇళ్ల గృహాలకు సంబంధించి 1,829 బ్యాగుల సిమెంట్, 17,495 కిలోల స్టీల్ మాయమైనట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. ఈ విషయమై గతంలోనే ఆ ఏఈకి షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకున్నారు. హౌసింగ్ నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయని విచారణలో తేలడంతో కలెక్టర్ ఆయనపై వేటు వేశారు. దీంతో ఆ ఏఈ బాధ్యతలను ఆత్మకూరు డీఈ ముక్తర్ బాషకు అదనంగా అప్పగించారు.

నత్త నడకన యూడైస్ ప్లస్

• జూనియర్ కళాశాలలకు యూడైస్ ప్లస్ పోర్టల్
• విద్యార్థులు, కళాశాలల వివరాల నమోదుకు ఆదేశాలు
• వాటి ఆధారంగా కళాశాలలకు గుర్తింపు
• మెజార్టీ కళాశాలలు నమోదులో జాప్యం
• అయినా కళాశాలలు ప్రారంభించి అదనపు సెక్షన్లు, షిఫ్టింగ్‌కు దరఖాస్తులు
• తనిఖీలు చేయని ఇంటర్‌బోర్డు అధికారులు



నెల్లూరు(టౌన్): జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల నిర్వహణ వాటి యాజమాన్యాల ఇష్టారాజ్యంగా మారింది. జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభించి 53 రోజులు పూర్తయినా ఇంకా అరకొరగానే వివరాలను నమోదు చేస్తున్నారు. విద్యార్థుల సమగ్ర వివరాలను యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నమోదు ఆధారంగా కళాశాలల రెన్యువల్, గుర్తింపు ఉంటుందని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. పోర్టల్‌లో నమోదైన విద్యార్థులనే ఈ ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలకు అనుమతించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి వివరాలు నమోదు పూర్తి చేయాలని గడువు విధించారు. అయితే ఈ ఆదేశాలను కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలు పెడచెవిన పెట్టాయి.

జిల్లాలో మొత్తం 208 వరకు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం 186 జూనియర్ కళాశాలల్లో మాత్రమే విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ యాజమాన్యం కింద 54 జూనియర్ కళాశాలలు ఉండగా, 132 కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 59 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి ఏటా 29 వేల మందికి పైగా ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందుతున్నారు. ఇంటర్ తరగతులను జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభించారు. ఇంకా కొన్ని కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే వివరాలు నమోదుకు ఆలస్యంగా పేర్కొంటున్నారు.

నమోదులో తీవ్ర జాప్యం

యూడైస్ ప్లస్‌లో ద్వితీయ సంవత్సర విద్యార్థుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేస్తేనే ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల నమోదుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ వల్ల వివరాల నమోదుకు ఆలస్యమవుతున్నట్లు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. యూడైస్ ప్లస్‌లో వివరాలను నమోదు చేస్తే జూనియర్ కళాశాలల యాజమాన్యాల ఆగడాలకు చెక్ పడుతుందని పలువురు చెబుతున్నారు.

కళాశాలలు ప్రారంభించి షిఫ్టింగ్, సెక్షన్లకు దరఖాస్తు

కళాశాలల పునః ప్రారంభానికి ముందే కళాశాలల రెన్యువల్, రికగ్నిజేషన్, షిఫ్టింగ్, అదనపు సెక్షన్లకు రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే జిల్లాలో ప్రైవేటు యాజమాన్యాల తీరు ఈ నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉంది. తరగతులు ప్రారంభించి 53 రోజులు పూర్తయ్యాయి. ఆయా కళాశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో షిఫ్టింగ్, అదనపు సెక్షన్లకు ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారు. అయితే అనుమతి రాకుండానే ఆయా యాజమాన్యాలు కళాశాలలను నిర్వహిస్తున్నాయి. కళాశాలల అనుమతి, షిఫ్టింగ్, అదనపు సెక్షన్ల ఏర్పాటు తదితర వాటిపై తనిఖీలు చేయాల్సిన ఇంటర్‌బోర్డు అధికారులు మిన్నకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్మిషన్లు సమయంలో ఆయా యాజమాన్యాలు ఇంటర్‌బోర్డు అధికారులకు కొంత మొత్తాన్ని ముట్టజెబుతుండటంతోనే అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేయాలి

కళాశాలల్లో విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో త్వరితగతిన నమోదు చేయాలి. ఇప్పటికే ఇందుకు సంబంధించి ఆయా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశాం. రికగ్నిజేషన్ ఉంటేనే యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రథమ సంవత్సర అడ్మిషన్లకు ఈనెలాఖరు వరకు గడువును పెంచాం. షిఫ్టింగ్, అదనపు సెక్షన్లు, రెన్యువల్ తదితర వాటి కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

– శ్రీనివాసులు, ఆర్ఐఓ

విద్యార్థులకు ఇంగ్లిష్ బాగా నేర్పించాలి



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

నెల్లూరు (టౌన్): ఇంగ్లిష్ ప్రపంచ భాషని, పిల్లలకు చిన్నప్పటి నుంచే బాగా నేర్పించాలని డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. బుధవారం స్థానిక సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో నెల్లూరు అర్బన్, కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 5వ తరగతి వరకు ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు విభా లీప్ ఫర్ వర్డ్ ఇంగ్లిష్ లిటరసీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలన్నారు. ఏఎంఓ సుధీర్‌బాబు, నెల్లూరు అర్బన్ ఎంఈఓ అబ్దుల్‌హమీద్, హైస్కూల్ హెడ్ మాస్టర్ అరవింద్, ట్రైనీ టీచర్స్ నిహారిక, చందన, రవళి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (దర్గామిట్ట): సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ, కేంద్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సాధికారిక కోసం కృషి చేస్తున్న దివ్యాంగులు, సంస్థలకు అవార్డులు ప్రదానం చేసేందుకు అర్హులైన వారి వద్ద నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఎస్ వినయ్‌కుమార్ మంగళవారం కోరారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు జూలై 31 ఆఖరు అని, www. awards. gov. in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www. depwd. gov. in సందర్శించాలని తెలిపారు.

పట్టాలు తప్పిన ప్రగతి

- భారతదేశంలోనే అతిపెద్ద రెండో రైల్వే కేంద్రం బిట్రగుంట
- షిఫ్ట్ పద్ధతిలో 4 వేల మంది కార్మికులు నిరంతరం విధులు
- ఇంగ్లిష్, తెలుగు మీడియం స్కూళ్లు
- 2 వేల ఎకరాలకుపైగా రైల్వే భూములు
- 4 వేలకుపైగా రైల్వే క్వార్టర్స్ భవనాలు
- ఆస్పత్రి, పార్కులు, ఇన్‌స్టిట్యూట్
- శతాబ్దం తర్వాత ప్రాభవం కోల్పోతూ.. నిర్వీర్య దశకు చేరుకున్న వైనం
- 2004లో కాంక్రీట్ స్లీపర్స్ తయారీ ఫ్యాక్టరీకి శంకుస్థాపన

భారతీయ రైల్వేలో రెండో అతిపెద్ద రైల్వే కేంద్రంగా విరాజిల్లిన బిట్రగుంట ప్రాభవాన్ని కోల్పోయింది. పాలకుల నిర్లక్ష్యం, రైల్వే శాఖ అధికారుల స్వార్థం వెరసి సాధారణ రైల్వేస్టేషన్‌గా మారింది. బొగ్గు, నీటి ఆవిరి ఇంజిన్ల కాలం వరకు శతాబ్దం పాటు ఓ వెలుగు వెలిగింది. డీజిల్, ఎలక్ట్రికల్ ఇంజిన్ల దశకం ప్రారంభంతో శల్య దశకు చేరుకుంది. రూ.వేల కోట్ల విలువైన రైల్వే భూములు నిరుపయోగంగా మారాయి. రైల్వే కార్మికుల గృహాలు కొన్ని శిథిలం కాగా, మరికొన్ని అవసాన దశలో ఉన్నాయి. ఎంతో మందిని విద్యావంతులను చేసి అదే రైల్వేశాఖలో కొలువులు కల్పించిన రైల్వే స్కూళ్లను సమూలంగా నేలమట్టం చేశారు. ఆస్పత్రి భవనాలు, జ్ఞానం, క్రీడా సంపదకు నెలకొన్న ఇన్‌స్టిట్యూట్, ఆటపాటలతో అలరారిన పార్కులు పిచ్చి చెట్ల అడవిగా మారాయి. బిట్రగుంటకు పూర్వవైభవాన్ని కల్పించేందుకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి కేంద్ర రైల్వే మంత్రి లాలూప్రసాద్‌యాదవ్‌తో కలిసి కాంక్రీట్ స్లీపర్స్ తయారీ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసినా అది కార్యరూపం దాల్చలేదు.



కావలి: మినీ ఇంగ్లండ్‌గా పేరుగాంచిన బిట్రగుంట.. గత ప్రాభావాన్ని నెమరవేసుకుంటూ శిథిలమైన, నేలమట్టమైన ఆ నాటి చరిత్రాత్మక కట్టడాలను చూస్తూ శల్యమైపోతుంది. వేలాది కుటుంబాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించింది. లక్షల మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దింది. స్టీమ్ ఇంజిన్ల కాలం వరకు మరమ్మతుల్లో భారతదేశానికే ఐకానిక్‌గా నిలిచింది. రూ.వేల కోట్ల విలువైన 2 వేల ఎకరాలకుపైగా రైల్వే స్థలాలు, చెక్కు చెదరని రైల్వే పరిపాలన భవనాలు, వేలాది ఉద్యోగులు, కార్మికుల నివాసాలు శిథిల స్థితిలో గతం సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అభివృద్ధి శాపానికి గురైంది. కొత్త రైల్వే లైన్ల కోసం దేశ వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములు సేకరించే రైల్వే శాఖ, బిట్రగుంటలో ఉన్న సుమారు 2 వేల ఎకరాలు సొంత భూమిని గాలికి వదిలేసింది. రైల్వే శాఖ ఉపాధి కల్పన పేరుతో పలు రకాల స్కీమ్‌లను ప్రవేశ పెడుతోంది. అయితే బిట్రగుంటలో ఉన్న చరిత్రాత్మకమైన ఉద్యోగ, ఉపాధి కేంద్రాన్ని మూసేసినా, ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించే యూనిట్‌ను ఏర్పాటు చేయలేకపోతోంది.

అన్ని వనరులు ఉండడంతో..


1880వ సంవత్సరంలో ఆంగ్లేయులు రైల్వేలైన్‌తో పాటు రైల్వే కేంద్రంగా నిర్మాణానికి సర్వే చేస్తున్న క్రమంలో ప్రతి ప్రాంతంలో ఏదో ఒక సమస్య. కొన్ని చోట్ల భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, మరికొన్ని చోట్ల ఆవిరి ఇంజిన్లు నడిపేందుకు అవసరమైన నీటి వనరుల లభ్యత లేకపోవడం. నాలుగేళ్ల సుదీర్ఘ అన్వేషణ తర్వాత బిట్రగుంట ప్రాంతంలో నీటి వనరులు, భూములు అందుబాటులో ఉండడం అన్ని విధాలుగా బెటర్ అనిపించి ఇక్కడ రైల్వే కేంద్రం నిర్మించాలని నిర్ణయించారు. ఎటుచూసినా నీటి గుంటలు ఉండడంతో బెటర్‌గుంట.. కాలక్రమంలో బిట్రగుంటగా మారింది. 1885 నాటికి ఈ ప్రాంతాన్ని భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే కేంద్రంగా తీర్చిదిద్దారు. సుమారు 4 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 30 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించి రైల్వే లైన్ల ఏర్పాటు, రైళ్ల మరమ్మతులను చేపట్టారు.

రెండో అతిపెద్ద రైల్వే కేంద్రంగా..

అప్పట్లో రైలు ఇంజిన్ ఒక వైపు మాత్రమే ఉండేది. విజయవాడ- చెన్నై మధ్య కేంద్రంగా బిట్రగుంటలో ఆవిరి ఇంజిన్ల మరమ్మతులు, పరీక్షల కోసం దేశంలోనే రెండో అతిపెద్ద లోకో రౌండ్ హౌస్ (మొదటి రౌండ్ హౌస్ మైసూర్‌లో ఉంది) నిర్మాణాన్ని చేపట్టారు. రైలు ఇంజిన్ల దిశ మార్చేందుకు టర్నెల్ ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆవిరి ఇంజిన్ల నిర్వహణ కోసం లోకో రౌండ్ హౌస్ నిర్మాణాన్ని దశల వారీగా చేపట్టి 1935 నాటికి పూర్తి చేశారు. ఈ రౌండ్ హౌస్‌లో ప్రతి రోజూ వెయ్యి మంది కార్మికులకు పైగా పనిచేసే వారు. ఆవిరి ఇంజిన్ల మరమ్మతుల కోసం నిర్మించిన లోకో రౌండ్ హౌస్‌కు అనుబంధంగా 1936లో లోకోషెడ్‌ను నిర్మించారు. ఈ షెడ్‌లో 2,500 మంది కార్మికులు వంతుల వారీగా స్టీమ్ ఇంజన్లకు మరమ్మతులు చేసేవారు.

ఆంగ్లేయుల స్వర్గధామంగా...

రైల్వే అధికారులుగా కొలువులు నిర్వహించేందుకు బిట్రగుంటలో వందల కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో బిట్రగుంట మినీ ఇంగ్లండ్ అనే పేరొచ్చింది. అధికారుల స్థానంలో ఉండే ఆంగ్లేయుల కోసం బిట్రగుంటలో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను ప్రత్యేకంగా నెలకొల్పారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో బిలియర్డ్స్, టెన్నిస్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు వివిధ భాషలు, దేశాలకు చెందిన పత్రికలు అందుబాటులో ఉంచేవారు. పక్కనే ఉదయం, సాయంత్రం వేళ వ్యాహ్యాళి కోసం పార్కును నిర్మించారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సంబరాలు ఇన్‌స్టిట్యూట్‌లో అంబరాన్నంటేలా నిర్వహించేవారు. విద్య, వైద్య సౌకర్యాలకు పెద్దపీట వేశారు. రైల్వేలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎటువంటి ఇబ్బంది పడకుండా 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా పాఠశాలల ప్రగతిపై సమీక్ష నిర్వహించి ఎప్పటికప్పుడు నూతన వసతులు సమకూర్చేవారు. బిట్రగుంటలో ఆంగ్లేయుల రాకతో స్థానికుల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. బిట్రగుంటను రైల్వే కేంద్రంగా తీర్చిదిద్దడంతో స్థానికుల దశ తిరిగింది. కార్మికుల కోసం దుకాణాలు, గృహ నిర్మాణాలు ఊపందుకోవడం, ఉద్యోగాలు రావడంతో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. స్థానికుల వేష భాషల్లోనూ ఆధునికత సంతరించుకుంది. సుమారు శతాబ్దం పాటు ఈ ప్రాభవం కొనసాగింది.



డీజిల్ ఇంజిన్ల శకంతో శాపంగా..

1980 తర్వాత భారతీయ రైల్వేలో ఆధునికీకరణ ప్రారంభమైంది. డీజిల్ ఇంజిన్లు అందుబాటులోకి రావడం బిట్రగుంటకు పెద్ద ఎదురు దెబ్బగా మారింది. బొగ్గు ఇంజిన్ల మరమ్మతుల్లో నైపుణ్యం కలిగిన కార్మికులు, ఉద్యోగులు కొత్త ఆవిష్కరణను అందిపుచ్చుకోవడంలో విఫలం కావడం షెడ్ ఆధునికీకరణకు అవరోధంగా మారింది. అంతలోనే 1982లో విద్యుత్ రైళ్ల శకం ప్రారంభంతో లోకోరౌండ్ హౌస్, లోకోషెడ్ రెండూ మూత పడ్డాయి. స్వాతంత్ర్యానంతరం కూడా ఇక్కడే జీవనాన్ని కొనసాగించిన ఆంగ్లో ఇండియన్లు ఒక్కొక్కరుగా బిట్రగుంట విడిచి వెళ్లిపోయారు. ఒక్కో విభాగం మూత పడుతూ 1998 నాటికి బిట్రగుంట పూర్తిగా తన ప్రాభవాన్ని కోల్పోయింది. ప్రధాన ఇంజినీరింగ్ విభాగాలన్నీ రేణిగుంట, విజయవాడకు వెళ్లిపోయాయి. లోకోషెడ్, లోకో రౌండ్ హౌస్, సిబ్బంది క్వార్టర్లు, కార్యాలయ భవనాలు, పార్కు, ఫుట్‌బాల్ కోర్టు అన్నీ శిథిలావస్థకు చేరుకుని గత వైభవానికి చిహ్నంగా మిగిలాయి. తిరిగి పూర్వవైభవం కల్పించాలనే డిమాండ్ నానాటికి పెరుగుతుండడంతో కొన్నేళ్ల క్రితం లోకోషెడ్‌ను నేలమట్టం చేశారు. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల పాఠశాలలను నేలమట్టం చేశారు.

పూర్వవైభవం.. స్వప్నంగా..

సుమారు రెండు వేల ఎకరాల స్థలం, నిపుణులైన కార్మికులు, విజయవాడ- చెన్నై మధ్య కీలకమైన వనరులు ఉన్న బిట్రగుంటలో ఏర్పాటు చేయాలనుకున్న క్యారేజ్ రిపేర్ వర్క్ షాపు ఒకసారి రేణిగుంటకు, మరో సారి రాయనపాడుకు తరలిపోయాయి. బిట్రగుంటను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనుకున్నా.. చివరకు గుంటూరును ఎంపిక చేశారు. రూ.100 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ మల్టీ ఫ్యూయల్ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే రూ.30 కోట్లతోనే పూర్తవుతుందని 1997 సెప్టెంబర్‌లో నిర్వహించిన రైల్వే అధికారిక సర్వేలో స్పష్టమైనా ఇంత వరకూ అతీగతీ లేదు. కొద్ది పాటి వ్యయంతో లోకోషెడ్‌ను ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ షెడ్డుగా మార్పు చేసుకోవచ్చనే ఆలోచన పదిహేను ఏళ్లుగా ప్రతిపాదన దశలోనే ఉండి అధికారుల తిరస్కరణకు గురైంది. రాజకీయ పార్టీలకు బిట్రగుంటకు పూర్వవైభవం.. ప్రతి ఎన్నికల్లో ఒక ప్రచారాస్త్రంగా మారింది. బిట్రగుంట ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. ఇక్కడ కాంక్రీట్ స్లీపర్స్ తయారీ ఫ్యాక్టరీ నిర్మాణానికి 2004 నవంబర్ 17న అప్పటి రైల్వే మంత్రి లాలూప్రసాద్ యాదవ్ కలిసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల తర్వాత బిట్రగుంటను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు.



2004లో అప్పటి సీఎం వైఎస్సార్, రైల్వేమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

అటవీశాఖలో ఎర్ర దొంగలు

- 'నమ్మకంగా' దుంగలు తరలించారు
- టాస్క్‌ఫోర్స్ ఆపరేషన్‌లో పట్టుబడిన వైనం

ఆత్మకూరు: అటవీ శాఖలో ఇంటి దొంగలు టాస్క్‌ఫోర్స్ ఆపరేషన్‌లో పట్టుబడ్డారు. క్షేత్ర స్థాయిలో అటవీశాఖకు 'కళ్లు' లాంటి వాచర్లు (బేస్ క్యాంపు సిబ్బంది) కంచె చేను మేసిన చందాన ఏకంగా ఎర్రచందనం తరలిస్తూ ఇంటి దొంగలుగా మారారు. కడప పోలీసు అధికారులు, చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారుల సమన్వయంతో ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేపట్టిన ఆపరేషన్‌లో ఎట్టకేలకు వీరు పట్టుబడ్డారు. ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని మర్రిపాడు మండలం కదిరినాయుడు పల్లి, చుంచులూరుకు చెందిన షేక్ రసూల్, పాశం పెంచలప్రసాద్, చిన్నయ్య అటవీశాఖలో వాచర్లుగా పని చేస్తున్నారు. నమ్మకంగా పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవడంతో అధికారులు సైతం అనుమానం పడలేదు. ఈ క్రమంలో నాలుగు నెలల వ్యవధిలో సుమారు ఆరు లారీలకు పైగా ఎర్రచందనాన్ని జిల్లా బార్డర్ దాటించడంలో వీరు ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థమవుతోంది. ఎర్రచందనం తరలుతోందన్న అనుమానాలు వైఎస్సార్ జిల్లా పోలీసులకు ఉప్పందడంతో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఎర్రచందనాన్ని పలు మార్గాల ద్వారా జిల్లా సరిహద్దులు దాటిస్తున్న ఈ ముగ్గురు మంగళవారం అర్ధరాత్రి ఓ లేలాండ్ లారీలో 59 దుంగల ఎర్రచందనాన్ని లోడ్ చేసి తరలించడంలో సహకరించారు. పోలీసు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో అడవిమానుకుంట వద్ద ఆ లారీని పట్టుకున్నారు. వాచర్లు షేక్ రసూల్, పాశం పెంచల ప్రసాద్‌తో పాటు వింజమూరుకు చెందిన గుద్దేటి రామనాథ రెడ్డి పట్టుబడగా, మరో వాచర్ చిన్నయ్య తప్పించుకుని పారిపోయాడు. లారీతో పాటు రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.21 లక్షలు ఉంటుందని కడప పోలీసులు తెలిపారు. కేసును పూర్తి స్థాయిలో విచారించగా, వాచర్లుగా ఉంటూ ఎర్రచందనం అక్రమ రవాణా చేసే వారితో వీరు కుమ్మక్కై, అటవీ ప్రాంతం బాగా తెలియడంతో పలు మార్గాల ద్వారా జిల్లా సరిహద్దులను దాటిస్తున్నారని వెలుగులోకి వచ్చింది. వీరి వ్యవహారంపై అనుమానం ఉండడంతో చెన్నయ్యను 20 రోజుల క్రితం ఉద్యోగం నుంచి తొలగించామని, రసూల్, ప్రసాద్‌పై నిఘా ఉంచి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వేచి ఉన్నామని ఆత్మకూరు అటవీ శాఖ అధికారులు చెప్పడం గమనార్హం. బుధవారం వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో మీడియా సమావేశంలో పోలీసు అధికారులు వివరాలు వెల్లడించారు.



పట్టుబడిన ఎర్రచందనం, వాచర్లు, అక్రమ రవాణా దారుడితో వైఎస్సార్ జిల్లా పోలీసులు

మద్యం బెల్టు దుకాణాలపై దాడి

- 23 బాటిళ్ల స్వాధీనం
- టీడీపీ మద్దతుదారులని వదిలేసిన వైనం

ఆత్మకూరు: చేజర్ల మండలంలోని టీకేపాడులో పేటేటి పెంచలయ్య, సెల్లం లక్ష్మమ్మ, తల్లా పెంచల నరసయ్య బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున పొదలకూరు సెబ్ సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో దాడులు చేసి ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 23 బాటిళ్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని పొదలకూరుకు తరలించారు. అయితే వీరు టీడీపీ సానుభూతిపరులు కావడంతో వదిలేశారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సెబ్ అధికారి వెంకట్రావును వివరణ కోరగా లక్ష్మమ్మ వద్ద 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నది వాస్తవమేనని, అయితే ఆమె తొలి సారిగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకుని పంపించేశామన్నారు. వారిద్దరి దగ్గర 3 బాటిళ్లు దొరికాయన్నారు.

ప్రజాస్వామ్యంలో ఆటవిక పాలన



కొరుటూరులో స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రసన్న

- దోషులను చట్టపరంగా శిక్షించాలి
- మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థులపై దాడులు, ఆస్తులు ధ్వంసాలు చేయడం ఆటవిక పాలనకు అద్దం పడుతుందని, ఇలాంటి చర్యలను చేపట్టడం, ప్రోత్సహించడం సరికాదని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఇలాంటి ఘటలకు పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొరుటూరులో మంగళవారం టీడీపీకి చెందిన తుమ్మల జశ్వంత్ సుమారు పది మంది రౌడీ మూకలతో కలిసి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత షేక్ షబ్బీర్ ఇంట్లో వస్తువులు, గృహోపకరణాలను ధ్వంసం చేసి, ఆయన తల్లిపై దాడి చేసిన ఘటన తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం కొరుటూరు గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనపై షబ్బీర్, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం ప్రశాంతతకు మారు పేరన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, అనంతరం అందరం కలిసి మెలిసి ఉంటారన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఇళ్లను ధ్వంసం చేయడం, దాడులు తెగబడడం వంటి కొత్త సంస్కృతిని తీసుకువచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు తనతో పాటు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై వీరేంద్రబాబుతో ఈ దాడులకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర పశుగణాభివృద్ధి చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య, పామంజి శ్రీనివాసులు, తిరుమలరావు, స్వర్ణా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.130
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.232
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.178



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.65
సన్నవి :	రూ.45
పండ్లు :	రూ.35

